

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● గద్వాల ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఎగువ కర్ణాటక, మహారాష్ట్రాలలో కురుస్తున్న వర్షాలకు కృష్ణా, తుంగభద్ర నదులకు భారీగా వరదవస్తోంది. నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గద్వాల ఎస్పీ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. మత్స్యకారులు చేపలవేటకు వెళ్లవద్దని, పశువులు, గొర్రెల కాపరులు, రైతులు నదీ తీరానికి వెళ్లవద్దని ఆయన సూచించారు. పోలీస్ అధికారులు నదీ తీరా గ్రామాలలో తగిన ఏర్పాట్లతో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఆదేశించారు.

ఆర్అండ్‌బీ రోడ్లకు

మహార్దశ

ఉమ్మడి జిల్లాలో హ్యామ్ కింద 660.01 కిలోమీటర్ల మేర రోడ్ల అభివృద్ధి

- 40 శాతం నిధులు ముందు విడుదల, వడ్డీతో సహా 60 శాతం15 ఏళ్లు చెల్లింపు
- రెండు సర్కిళ్ల పరిధిలో రూ. 833.53 కోట్లు ఖర్చవుతుందని అంచనాలు
- డబుల్ లేన్ల నిర్మాణంతో పాటు ఉన్న రోడ్లను అభివృద్ధి చేయడమే లక్ష్యం
- పాలమూరు సర్కిల్‌లో 26 రోడ్లు, వనపర్తి సర్కిల్‌లో 15 రోడ్లు మంజూరు



ఊకచెట్టు వాగు బ్రిడ్జి వద్ద దెబ్బతిని గుంతలు పడిన వనపర్తి- ఆత్మకూరు రోడ్డు

మహబూబ్‌నగర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : రాష్ట్రవ్యాప్తంగా ఆర్అండ్‌బీ రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం నడుం బిగించింది. పాత పద్ధతుల్లో కాకుండా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అంచనా వేసుకొని కొత్త పద్ధతిలో ఈ పనులు చేపట్టాలని నిర్ణయించింది. సాధారణంగా ఇంజనీరింగ్- ప్రొక్యూర్‌మెంట్- కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ), బిల్డ్- ఆపరేట్- ట్రాన్స్‌ఫర్ (బీవోటీ) విధానాల్లో గతంలో పనులు చేపట్టేవారు. వీటిలో ఈపీసీ విధానం ద్వారా అయితే ఒకేసారి రాష్ట్ర ప్రభుత్వంపై భారం పడుతుంది. బీవోటీ విధానం ద్వారా కాంట్రాక్టు సంస్థనే వ్యయం భరించి తర్వాత టోల్‌గేట్ల ద్వారా వాహనదారుల నుంచి అగ్రిమెంట్ ప్రకారం వసూలు చేసుకుంటుంది. ఒకేసారి రాష్ట్ర ప్రభుత్వంపై భారం వేసేలా ఆర్థిక పరిస్థితులు లేవు. బీవోటీ విధానం జాతీయ, రాష్ట్ర రహదారుల్లో మాత్రమే అమలు చేస్తున్నారు. ఆర్అండ్‌బీ రోడ్లకూ వసూలు చేస్తే విమర్శలు వచ్చే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం హైబ్రీడ్ యాన్యూనిటీ మోడ్ (హ్యామ్) పద్ధతిలో రోడ్లను నిర్మాణం చేయనుంది. దీనిప్రకారం టెండర్ దక్కించుకున్న సంస్థకు ముందుగా రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు చెల్లిస్తుంది. మిగతా 60 శాతం నిధులు కాంట్రాక్టు సంస్థనే భరించాలి. ఆ తర్వాత 15 ఏళ్లపాటు 60శాతం వ్యయానికి కొంత వడ్డీ కలిపి రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు సంస్థకు చెల్లిస్తుంది. ఈ పద్ధతిలో రోడ్ల నిర్మాణం ద్వారా అటు ఖజానాపై అధికభారం పడదు. అదే సమయంలో టోల్‌గేట్లు పెట్టాల్సిన అవసరం ఉండదు.. రోడ్ల అభివృద్ధి కూడా వేగంగా జరుగుతుంది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో రెండు సర్కిళ్లు ఉండగా ఈ రెండు సర్కిళ్ల పరిధిలో 41 రోడ్లను హ్యామ్ విధానంలో తొలిదశలో మంజూరు చేశారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగా త్వరలోనే టెండర్లు పూర్తి చేస్తామని ఆర్అండ్‌బీ అధికారులు చెబుతున్నారు.

మంజూరైన రోడ్లు ఇవే...

ఉమ్మడి పాలమూరు జిల్లాను గతంలోనే రెండు ఆర్అండ్‌బీ సర్కిళ్లుగా విభజించారు. వాటి పరిధి మేరకే ఇప్పుడు హ్యామ్

(మిగతా 6లో..)

రూ. 833.53 కోట్ల వ్యయం

హ్యామ్ తొలిదశ కింద ఉమ్మడి పాలమూరు జిల్లాలో మొత్తం 41 రోడ్లు ఎంపిక కాగా మహబూబ్‌నగర్ సర్కిల్ పరిధిలోని మహబూబ్‌నగర్, గద్వాల, నారాయణపేట జిల్లాలో 26 రోడ్లు, వనపర్తి సర్కిల్ పరిదిలోని వనపర్తి, నాగర్‌కర్నూలు జిల్లాల్లో 15 రోడ్లు అభివృద్ధి కానున్నాయి. మొత్తం 660.01 కిలోమీటర్ల మేర ఈ రోడ్లను మొదటి దశలో చేపట్టనుండగా ఇందులో సింగిల్ లేన్‌గా ఉన్న రోడ్లు డబుల్‌లేన్ గానూ ఇప్పటికే ఉన్న రోడ్లు మరమ్మతుల్లో ఉంటే వాటిని అభివృద్ధి చేయనున్నారు. మొత్తం రెండు సర్కిళ్లకు కలిపి రూ. 833.53 కోట్లు ఖర్చవుతుందని అంచనాలు వేయగా ఇందులో మహబూబ్‌నగర్ సర్కిల్ పరిధిలోని 26 రోడ్లకు రూ. 434.19 కోట్లు, వనపర్తి సర్కిల్ పరిధిలోని 15 రోడ్లకు 399.34 కోట్లను కేటాయించారు. వనపర్తి సర్కిల్ పరిధిలో మొత్తం 271.13 కిలోమీటర్ల రోడ్లను అభివృద్ధి చేయనుండగా 44.40 కిలోమీటర్ల మేర డబుల్ లైన్ రోడ్లను నిర్మిస్తారు. మిగతా 226.73 కిలోమీటర్ల మేర రోడ్లను అభివృద్ధి చేస్తారు. మహబూబ్‌నగర్ సర్కిల్ పరిధిలో 389.15 కిలోమీటర్ల రోడ్లను అభివృద్ధి చేయనుండగా ఇక్కడ డబుల్ లైన్ రోడ్లు లేవు. మొత్తం రోడ్ల అభివృద్ధి కోసమే ఖర్చు చేయనున్నారు.



జేపీఎన్‌సీఈ సమీపంలో మహబూబ్‌నగర్-రాయిచూరు రోడ్డు

కాంగ్రెస్‌లో కుమ్ములాట



గొడవ పడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

- గొడవకు దిగిన రెండు వర్గాల నాయకులు
- సమన్వయ లోపంతో ఒకరిపై ఒకరి దూషణలు
- తెరపైకి వచ్చిన పాత, కొత్త పంచాయితీ
- అబ్జర్వర్ ముందే తోపులాట

వనపర్తి టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కుమ్ములాట మళ్లీ తెరపైకి వచ్చింది. మంగళవారం వనపర్తి పట్టణంలో రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ కార్యక్రమంలో భాగంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అబ్జర్వర్ కిరణ్ మగబసవ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశం ప్రారంభం నుంచే కాంగ్రెస్ పార్టీ నాయకులు ఒకరిపై ఒకరు దూషణలకు దిగారు. సమావేశం మొత్తం రెండు వర్గాలుగా విడిపోయి తిట్ల పురాణం ప్రారంభించారు. కేవలం కొందరికి మాత్రమే సమాచారం ఇచ్చి అబ్జర్వర్‌తో సమావేశం ఎలా నిర్వహిస్తారని జిల్లా అధ్యక్షుడి తీరుపై మండిపడ్డారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి వర్గానికి సమాచారం ఇవ్వలేదని, చిన్నారెడ్డి వర్గీయులతోనే సమావేశం నిర్వహించడం సరి కాదని జిల్లా అధ్యక్షుడి తీరును తప్పుబట్టారు. మార్కెట్‌యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గతంలో టీడీపీ, బీఆర్ఎస్ పాలనలో ఎన్ని ప్రలోభాలు పెట్టినా ఎక్కడ తగ్గలేదని, కొత్తగా పార్టీలోకి వచ్చిన వారి గురించి ప్రస్తావిస్తుండగా కొందరు నాయకులు గొడవకు దిగారు. కొత్త, పాత కలయికతోనే పార్టీ అధికారంలోకి వచ్చిందని అన్నారు. సమావేశం జరుగుతుండగా కేవలం చిన్నారెడ్డి వర్గీకులకు మాత్రమే మాట్లాడే అవకాశం ఇస్తున్నారని, కొత్తగా పార్టీలోకి వచ్చిన వారికి అవకాశం ఇవ్వకపోగా పదేపదే కొత్త,పాత అనే పదం అనడం ఎమ్మెల్యే వర్గీయులను అవమానించడమే అవుతుందని లక్కాకుల సతీశ్ తదితరులు వెళ్లిపోయారు. చిన్నారెడ్డి, మేఘారెడ్డి వర్గీయుల మధ్య సమన్వయం లేక పోవడంతో సమావేశం రసాభాసగా సాగింది. జిల్లాకు వచ్చిన అబ్జర్వర్ మాత్రం నాయకులు, కార్యకర్తల గొడవను చూస్తూ కూర్చున్నారు.

ప్రజల భాగస్వామ్యంతో పెద్ద పులుల సంరక్షణ



శ్రీశైలం హైదరాబాద్ రహదారిపై అవగాహన ర్యాలీలో పాల్గొన్న డివిజన్ అధికారి రాంమోహన్ 7

మొక్కజొన్న పొట్టుతో.. పెన్నుల తయారీ

- జాతీయ స్థాయికి ఎంపికైన ప్రాజెక్టు
- జోగులాంబ గద్వాల జిల్లా విద్యార్థుల ప్రతిభ



మొక్కజొన్న కంకుల పొట్టుతో తయారు చేసిన పెన్నులు



జాతీయ స్థాయికి ఎంపికైన అనంతపురం జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు 6

చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలి

- సీఎండీఏ జాయింట్ డైరెక్టర్ నారాయణరావు



ఆత్మకూరులోని ఆక్సిజన్ పార్కులో మొక్క నాటి నీరు పోస్తున్న జాయింట్ డైరెక్టర్ నారాయణరావు 6



వనపర్తి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కల్పిస్తున్న డీడబ్ల్యూవో సుధారాణి (ఫైల్)

అమ్మపాలు అమృతం

- తాగిస్తే బిడ్డకు, తల్లికీ రక్ష 7
- ఆగస్టు 1 నుంచి 7 వరకు తల్లిపాల వారోత్సవాలు


పెట్రేగుతున్న సైబర్ నేరగాళ్లు

- మాయమాటలతో బ్యాంకు ఖాతాలు ఖాళీ

నాగర్‌కర్నూల్ క్రైం, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరగాళ్ల ఆగడాలు రోజు రోజుకు పెట్రేగిపోతున్నాయి. మాయమాటలతో ఎంతో మందిని మభ్యపెట్టి వారి బ్యాంకు ఖాతాల నుంచి నగదు స్వాహా చేస్తున్నారు. పొరపాటుగా మీ ఖాతాలో డబ్బు జమైందని, కేవైసీ అప్‌డేట్ చేసుకోవాలని, కస్టమ్స్, పోలీస్ అధికారులమంటూ మోసం చేస్తున్నారు. అంతే కాకుండా మీ బంధువులు, స్నేహితులు పార్సిల్స్ పంపారని, వాటిని మీరు పొందాలంటే మీ మొబైల్‌కొచ్చిన ఓటీపీ చెప్పాలని ప్రాధేయపడతారు. పార్సిల్ వచ్చిందని ఆశపడి ఓటీపీ చెబితే బ్యాంకులో ఉన్న నగదు ఖాళీ చేస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో జనవరి నుంచి జూన్ మాసం వరకు 348 సైబర్ కేసులు నమోదయ్యాయి. వాటిలో 68 కేసులను సైబర్ పోలీసులు ఛేధించారు. 213 కేసులు విచారణలో ఉండగా 67 ఎఫ్ఐఆర్ నమోదయ్యాయి. సైబర్ నేరగాళ్లు దాదాపు ప్రజల ఖాతాల ద్వారా దాదాపు రూ.2 కోట్లకు పైగానే సొమ్ము చేసుకున్నారు. ఇందులో రూ.12లక్షలను రికవరీ చేశారు. నేరగాళ్ల ఖాతాలో ఉన్న రూ.44లక్షల 95వేలను సీజ్ చేశారు.

వ్యక్తిగత సమాచారమివ్వొద్దు

గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చిన ఫోన్‌కాల్స్‌కు స్పందించవద్దు. గుర్తు తెలియని



వ్యక్తులు ఫోన్ చేసినప్పుడు తక్షణమే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. సైబర్ మోసానికి గురైతే తక్షణమే 1930కు ఫిర్యాదు చేయాలి. డిజిటల్ అరెస్టులు బోగస్ అని వాటి విషయాల్లో జాగ్రత్తగా ఉండాలి.

- గిరికుమార్, సైబర్ డీఎస్పీ

నిర్వాసితులకు అండగా ఉంటాం



పాఠశాల ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట, జూలై 29(ఆంధ్రజ్యోతి): శంకర సముద్రం రిజర్వాయర్ నిర్వాసితులకు అండగా ఉంటామని, వారి న్యాయమైన సమస్యలు పరిష్కరించి పునరావాసానికి తరలిస్తామని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పునరావాసంలో రూ. 43.5 లక్షలతో నిర్మించిన ప్రాథమిక పాఠశాలను వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి ప్రారంభించారు. అదేవిధంగా వడ్డెర, యాదవ, హమాలీ కమ్యూనిటీహాల్ భవనాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రిజర్వాయర్, కాలువల పనులు పూర్తి అయినప్పటికీ పదేళ్ల పాలన సాగించిన బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వాసితుల, రైతుల సమస్యలు పరిష్కరించలేకపోయిందని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పునరావాసంలో పెండింగ్ పనులు, నిర్వాసితుల న్యాయమైనా కోర్కెలకు కావాల్సిన నిధుల మంజూరుకు కృషి చేశానని తెలిపారు. అంతకు ముందు విద్యాశాఖ అధికారులు అబ్దుల్ ఘని, కృష్ణయ్య కలెక్టర్, ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ ప్రశాంత్, సురేందర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, గోకరయ్య, భీమన్న నాయుడు, కరాటే శివ తదితరులు ఉన్నారు.



భక్తిశ్రద్ధలతో బంగారు మైసమ్మ బోనాలు

- పాల్గొన్న కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి 6

మందుబాబులకు అడ్డాగా టూరిజం లాంచి

- విందులు, వినోదాలు చేస్తున్న తాగుబోతులు
- అనధికార వ్యక్తుల ఆధీనంలో లాంచి
- అప్రతిష్టపాలవుతున్న పర్యాటక శాఖ

బ్రహ్మగిరి, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : నల్లమల అటవీ ప్రాంతంలోని దర్శనీయ క్షేత్రాలను పర్యాటకంగా అభివృద్ధి చేసి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. నల్లమల ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి 2015 సంవత్సరంలో తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి స్వదేశీ దర్శన్ పథకంలో భాగంగా రూ. 93 కోట్ల నిధులను విడుదల చేశారు. ఆ నిధులతో నల్లమలలోని వివిధ పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టారు.

పర్యాటక, అటవీశాఖ సంయుక్తంగా..

సోమశిల నుంచి శ్రీశైలం వరకు కృష్ణానదిలో లాంచి నడిపేందుకు పర్యాటక, అటవీశాఖ సంయుక్తంగా జనవరి మొదటి వారంలో ప్రారంభించారు. అక్క మహాదేవిగుహల సందర్శనకు లాంచిలో పెద్దలకు రూ. 600, చిన్న పిల్లలకు రూ. 500 టికెట్ ధర నిర్ణయించారు. సుమారు ఆరు నెలల పాటు లాంచి నడిపించారు. ప్రస్తుతం కృష్ణానదికి వరద ప్రవాహం అధికంగా వస్తుండటంతో రెండు వారాలుగా టూరిజం శాఖ లాంచిని నిలిపివేసింది.

అసాంఘిక కార్యకలాపాలకు..

నల్లమల అందాలను తిలకించేందుకు వివిధ రాష్ట్రాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. బ్రహ్మగిరి కృష్ణానదిలో తెలంగాణ టూరిజం శాఖ ఆధ్వర్యంలో నడిపే లాంచి నేడు తాగుబోతులకు అడ్డాగా మారింది. టూరిజం శాఖ అధికారుల పర్యవేక్షణ లోపంతో లాంచిని అనధికార వ్యక్తులకు అప్పగించారు. దీంతో తాగుబోతులు అనధికార వ్యక్తులకు డబ్బు ముట్టజెప్పి టూరిజం లాంచిని తాగడానికి, పేకాట ఆడేందుకు, విందు వినోదాలకు వినియోగిస్తున్నారు. దీంతో టూరిజం శాఖ అప్రతిష్ట పాలవుతుందని, అసాంఘిక కార్యకలాపాలకు సహకరిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

టూరిజం శాఖలో ఉన్న ఉద్యోగులు చాలా వరకు అవుట్ సోర్సింగ్ పద్దతిలో విధులు నిర్వర్తిస్తున్నారు. బ్రహ్మగిరి లాంచి ఆపరేటర్ కొంత కాలంగా ఇక్కడ ఉండటం లేదు. దీంతో అనధికార వ్యక్తికి అప్పగించడంతో పర్యాటకుల నుంచి డబ్బులు అడ్డగోలుగా వసూలు చేస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.



బ్రహ్మగిరి టూరిజం లాంచిలో మందుబాబులు

ఆర్అండ్‌బీ రోడ్లకు మహర్దశ

(5వ పేజీ తరువాయి)

రోడ్ల అభివృద్ధి జరగనుంది. మహబూబ్‌నగర్ జిల్లాలో 175.69 కిలోమీటర్ల రోడ్లను మరమ్మతు చేయనుండగా నారాయణపేట జిల్లా పరిధిలో 91.96 కిలోమీటర్లు, జోగుళాంబ గద్వాల జిల్లా పరిధిలో 120.09 కిలోమీటర్లు, వనపర్తి జిల్లాలో 110.53 కిలోమీటర్లు, నాగర్‌కర్నూలు జిల్లాలో 160.60 కిలోమీటర్ల మేర రోడ్లను అభివృద్ధి చేయనున్నారు. వీటికి రూ. 833.53 కోట్లు ఖర్చు కానుంది. గద్వాల జిల్లాలో ఎర్రిగెర- అయిజ-అలంపూర్, గద్వాల- రంగాపూర్, గద్వాల- అయిజ, తుంగభద్ర బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు, మహబూబ్‌నగర్ జిల్లాలో మహబూబ్‌నగర్- మున్ననూరు రోడ్డు, మహబూబ్‌నగర్- నవాబుపేట రోడ్డు, మహబూబ్‌నగర్- చించోలి రోడ్డు, వేపూరు జడ్పీ రోడ్డు (గుండ్యాల స్టేజ్), దేవరకద్ర పీడబ్ల్యూ రోడ్డు- కురుమూర్తి టెంపుల్, రాయిచూర్ పీడబ్ల్యూడీ రోడ్డు (కోడూరు స్టేజ్), జడ్చర్ల రైల్వేస్టేషన్- కొత్త మొల్గర రోడ్డు, రాజాపూర్- తిరుమలాపూర్, కోయిల్‌కొండ ఆర్అండ్‌బీ రోడ్డు (మైసమ్మ టెంపుల్), జడ్చర్లలోని గాంధీ విగ్రహం నుంచి మాచారం, రాయచూర్ పీడబ్ల్యూడీ రోడ్డు (ఎనుగొండ), మరికల్- మహ్మదాబాద్ రోడ్డు, నారాయణపేట జిల్లాలోని మరికల్- మినాస్‌పూర్ రోడ్డు, మక్తల్- నారాయణపేట రోడ్డు, మక్తల్ బ్రాంచ్ రోడ్డు- కృష్ణారోడ్డు, ఆత్మకూరు- మరికల్ రోడ్డు, నాగర్‌కర్నూలు జిల్లాలోని వనపర్తి- జడ్చర్ల రోడ్డు, మహబూబ్‌నగర్- మన్ననూరు రోడ్డు, బల్మూరు- నాగర్‌కర్నూలు పీడబ్ల్యూడీ రోడ్డు, అచ్చంపేట- రాకొండ (వయా ఉప్పునుంతల) రోడ్డు, పెంట్లవల్లి క్రాస్ రోడ్డు- వనపర్తి (వయా శ్రీరంగాపూర్), అమ్రాబాద్- ఇప్పలపల్లి రోడ్డు, వనపర్తి జిల్లాలోని వనపర్తి- జడ్చర్ల రోడ్డు, వనపర్తి- ఆత్మకూరు రోడ్డు, ఆత్మకూరు- మరికల్ రోడ్డు, పెంట్లవల్లి క్రాస్ రోడ్డు- శ్రీరంగాపూర్ (వయా కొండూరు), వనపర్తి- బుద్ధారం రోడ్డు, చిన్నంబావి- చెల్లెపాడు రోడ్డును అభివృద్ధి చేయనున్నారు.

రేపు గురుకుల కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్లు

పెద్దకొత్తపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : పెద్దకొత్తపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్‌లో మొదటి సంవత్సరంలో బైపీసీ, ఎంపీసీ గ్రూప్‌లో మిగిలిపోయిన సీట్లకు ఈనెల 31వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అక్కుల్ తెలిపారు. 31వ తేదీన ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు వచ్చి స్పాట్ అడ్మిషన్లలో పాల్గొనాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

● మన్ననూర్ : అమ్రాబాద్ మండలం మన్ననూరు సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ఈ విద్యాసంవత్సరానికి ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 31 (గురువారం) స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ రూపాదేవి తెలిపారు.

● వంగూరు : స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో ఈ నెల 31న ఇంటర్ మీడియట్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులలో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అశ్విని తెలిపారు.

● తెలకపల్లి : స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో ఎంపీసీ, బైపీసీ మొదటి సంవత్సారానికి ఖాళీ సీట్ల భర్తీకి జూలై 31 స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎ.ఆర్ లక్ష్మి తెలిపారు. అడ్మిషన్లు ఎస్.ఎస్.సీ మెరిట్ ప్రకారం ఇస్తామని తెలిపారు.

చెంచుపెంటల్లో పోస్టాఫీస్ సేవలు

» వనపర్తి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ భూమన్న



అప్పాపూర్‌లో చెంచుల వివరాలు తెలుసుకుంటున్న వనపర్తి పోస్టల్ సూపరింటెండెంట్ భూమన్న

బ్రహ్మగిరి, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : నల్లమల లోతట్టు అటవీ ప్రాంతంలో ఉంటున్న చెంచుపెంటల్లోకి పోస్టాఫీస్ సేవలను విస్తరిస్తామని వనపర్తి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ భూమన్న అన్నారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ అభయారణ్యంలో ఉన్న అప్పాపూర్, భౌరాపూర్, మల్లాపూర్ తదితర చెంచు పెంటలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా వరకు చెంచు పెంటలు మన్ననూర్, వటువర్లపల్లి బ్రాంచ్ పోస్టాఫీస్‌కు అనుసంధానంగా ఉన్నాయని, ఈ పోస్టాఫీస్‌లు 30 కిలో మీటర్ల దూరంలో ఉన్నం దుకున్న చెంచులకు పోస్టాఫీస్ నుంచి సరైన సేవలు అందడం లేదని, చెంచుల వద్దకే పోస్టల్ సేవలు విస్తరించేందుకు చర్యలు చేపడుతున్నా మని ఆయన పేర్కొన్నారు. ఒక పోస్టాఫీస్ బాంచ్ ఏర్పాటు చేసేందుకు మైదాన ప్రాంతంలో మూడు వేల జనాభా ఉండాలని, అటవీ ప్రాంతం లో 15 వందల జనాభా ఉంటే సరిపోతుందన్నారు. అన్ని పెంటలకు కేం ద్రంగా ఉన్న అప్పాపూర్‌లో పోస్టాఫీస్ ఏర్పాచు చేసేందుకు చర్యలు చేపడుతామని భూమన్న తెలిపారు. కార్యక్రమంలో అప్పాపూర్ మాజీ సర్పంచ్ బాల గురువయ్య, వటువర్లపల్లి బీపీఎం నిరంజన్, సిబ్బంది రవీందర్ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో బంగారు మైసమ్మ బోనాలు

» పాల్గొన్న కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న గ్రామస్తులు

కల్వకుర్తి, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి మండలం మార్చాల సమీపంలోని కాటన్ మిల్లు మైసమ్మ దేవత బోనాల ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగాయి. మార్చాల, సత్యసాయినగర్‌ల నుంచి మహిళలు బోనం కుండలను అలంకరించుకుని నైవేద్యాలతో భారీ ర్యాలీగా తరలి వచ్చారు. బంగారు మైసమ్మకు నైవేద్యాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడడానికి ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలంతా చల్లగా ఉండాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమ్మవారిని ప్రార్థించారు. ఎమ్మెల్యేతోపాటు ముఖ్య అతిథులను శాలువాల, పూల మాలలతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొండూరు గోవర్ధన్, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు జిల్లెల రాములు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పసుల రమాకాంత్‌రెడ్డి, పలువురు నాయకులు, గ్రామస్థులు, బంగారు మైసమ్మ దేవాలయ కమిటీ సభ్యులు, మహిళలు ఉన్నారు.

ప్రొటెక్టర్‌తో పని సులభం

» యంత్ర పరికరంతో పంటలకు మందుల పిచికారి
» జిల్లాలో అందుబాటులో నాలుగు యంత్రాలు
» పత్తి, కంది, వేరుశనగ, పచ్చిమిర్చి, మొక్కజొన్న, చెరుకు పంటలకు స్ప్రే



పేట మండలం సింగారం గ్రామంలో పత్తి పంటలో తెగుళ్ల నివారణకు పిచికారి మందును స్ప్రే చేస్తున్న ప్రొటెక్టర్ యంత్రం

నారాయణపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మందుల పిచికారిలో ఆ ప్రొటెక్టర్ పనితనం భేషుగ్గా ఉందని రైతులు అంటున్నారు. త్వరగా.. సులభ పద్ధతిలో పనులు పూర్తవుతున్నట్లు పేర్కొంటున్నారు. పత్తి పంటకు చీడపురుగుల నుంచి రక్షణ పొందేందుకు రైతాంగం మందులను కొడ్తున్నారు. నారాయణపేట మండలం సింగారం గ్రామంలో ఆదివారం పత్తి పంటకు మందు కొట్టే ప్రొటెక్టర్ యంత్రంతో పిచికారి చేస్తూ కానవచ్చింది. ఒక బ్యారల్ మందు పిచికారి చేసేందుకు రూ.1200 కిరాయి ఈ యంత్రం నిర్వాహకులు తీసుకుంటున్నారు. ఒక్క బ్యారల్ మందు నాలుగు ఎకరాల పత్తి పంటకు సరిపోతుందని రైతులు చెబుతున్నారు. యంత్రం వినియోగం వల్ల పత్తి పంటలో మందులు పిచికారి త్వరగా పూర్తవుతుందని, దాంతో యంత్రాలను వినియోగిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. అయితే పత్తి పంటకు చీడ, దోమ నివారణ కోసం పిచికారి మందు యంత్రంతో స్ప్రే చేయించామని సింగారం గ్రామ రైతులు పెద్ద కిష్టప్ప, గురునాథ్‌లు తెలిపారు.

నాలుగు యాంత్రాలు గుజరాత్ రాష్ట్రం నుంచి దిగుమతి

మక్తల్ మండలం సోమేశ్వరబండకు చెందిన క్రాంతి సర్వీసెస్ పేరిట రైతు నర్సిరెడ్డి గుజరాత్ రాష్ట్రంలోని రాజ్‌కోట్ నుంచి గత నాలుగేళ్లుగా ఏడాదికి ఒకటి ప్రొటెక్టర్-600 యంత్రాలను జిల్లాకు తీసుకొని వస్తున్నారు. దీంతో ప్రస్తుతం నాలుగు యంత్రాలు రైతులకు అందుబాటులో ఉంచామని రైతు పేర్కొన్నారు. పంట పొలాల తెగుళ్ల నివారణ కోసం రైతులు తమ ఇష్టంతో తీసుకొచ్చే మందులు ఈ ప్రొటెక్టర్-600 యాంత్రానికి ఉండే బ్యారల్ 600 లీటర్ల నీటి సామర్థ్యం ఉంటుంద న్నారు. ఈ నీటిలో రైతు తీసుకువచ్చే తెగుళ్ల నివారణ మందులు కలిపి నాలుగు ఎకరాల పంటకు అర గంట వ్యవధిలోనే పిచికారి చేస్తారు. పత్తి, కంది, వేరుశనగ, పచ్చిమిర్చి, మొక్కజొన్న, చెరుకు తదితర పంటలకు పిచికారి చేయడం జరుగుతుంది.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

» నారాయణపేట, మక్తల్ నాకు రెండు కళ్ళు
» పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి



లబ్ధిదారులకు రేషన్ కార్డులను అందజేస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, కలెక్టర్ సిక్తాపట్నాయక్

నారాయణపేట టౌన్/ నర్వ, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని పశుసంవర్ధక, డెయిరీ డెవలప్‌మెంట్, క్రీడలు, యువజన సర్వీసులు, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. మంత్రి హోదాలో తొలిసారి ఆయన మంగళవారం నారాయణపేట జిల్లా కేంద్రానికి వచ్చారు. పట్టణంలోని ఎస్ఆర్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డిలతో కలిసి లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ నారాయణపేట, మక్తల్ నియోజకవర్గాలు తనకు రెండు కళ్లు అన్నారు. గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో పేదలకు రేషన్ కార్డులు కూడా ఇవ్వలేదన్నారు. జూరాల డ్యాం కూలిపోతుందని మాజీ ఎమ్మెల్యేలు ప్రజలను తప్పుదోవ పట్టించారని విమర్శించారు. ఈ జిల్లా వాసి రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో, జీవో 69 ద్వారా 4500 కోట్లతో మక్తల్, నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేశారని తెలిపారు. ఈ పథకాన్ని కూడా ప్రతిపక్షం అడ్డుకుంటోందని విమర్శించారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్రూం అంటూ ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. నియోజకవర్గానికి తాము 3,500 ఇందిరమ్మ ఇళ్లను రూ. 175 కోట్ల వ్యయంతో పార్టీలకు అతీతంగా అవినీతికి తావు లేకుండా నిర్మించి ఇస్తున్నామన్నారు. వీటిని తొందరగా పూర్తి చేస్తే అదనంగా మరో 3,500 ఇళ్లను మంజూరు చేయించే బాధ్యత తనదని మంత్రి భరోసా ఇచ్చారు. తాను మంత్రి అయ్యాక ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి ఫోన్ చేసి అభివృద్ధి పనులు అడిగారని, తాత నర్సిరెడ్డి పేరు నిలబెట్టాలని ఆయన ఎమ్మెల్యేకు సూచించారు. తాను తిరిగిన ఊరు ఇదని, ఇక్కడి గొడుగు గేరిలోని అమ్మమ్మ పోషల్ శివమ్మ ఇంట్లో ఉన్నానని తెలిపారు. మక్తల్‌లో సినిమా టాకీస్ లేని సమయంలో సైకిల్‌పై నారాయణపేటకు వచ్చి ఇక్కడి బాలాజీ టాకీస్‌లో సినిమా చూశానని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ ప్రతి మండలంలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ చేస్తామని, అర్హులైన వారు మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటే కొత్త కార్డులు వస్తాయని తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి మాట్లాడుతూ నిరుపేదల కొత్త రేషన్ కార్డుల కల కాంగ్రెస్ ప్రభుత్వంలో నెరవేరిందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ వార్ల విజయకుమార్, మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, ఆర్డీవో రాంచందర్‌నాయక్, మత్స్యసహకార సంఘం జిల్లా అధ్యక్షుడు కాంతుకుమార్, సివిల్ సప్లై అధికారి బాలరాజు, అధికారులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన

నర్వ మండలంలోని జక్కన్నపల్లి నుంచి మండల కేంద్రం వరకు రూ.2.90 కోట్లు, నర్వ నుంచి రాంపూర్ గేటు వరకు రూ.4.55 కోట్ల నిధులతో నిర్మించనున్న పది కిలో మీటర్ల బీటీ రోడ్డు పనులకు మంగళవారం మంత్రి వాకిటి శ్రీహరి శంకుస్థాపన చేశారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ప్రొసీడింగ్స్, 126 మంది లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, తహసీల్దార్ మల్లారెడ్డి, వివిధ శాఖ అధికారులు, పార్టీ మండల అధ్యక్షుడు చెన్నయ్య సాగర్, నాయకులు జలంధర్‌రెడ్డి, పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి, జగదభిరెడ్డి, జగన్మోహన్ రెడ్డి, నాగన్న గారి శ్రీనివాస్‌రెడ్డి, వివేకవర్ధన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శరణప్ప, అంజిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నర్సింహ పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలి

» సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్ నారాయణరావు



సమీక్ష సమావేశంలో సిబ్బందితో చర్చిస్తున్న జాయింట్ డైరెక్టర్ నారాయణరావు

ఆత్మకూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : అధికారులు చిత్తశుద్ధితో విధులు నిర్వర్తిస్తే మునిసిపాలిటీలు వేగంగా అభివృద్ధి చెందుతాయని కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) జాయింట్ డైరెక్టర్ నారాయణరావు పేర్కొన్నారు. వనపర్తి జిల్లా, ఆత్మకూరు పట్టణంలోని ఆక్సిజన్ పార్కును మంగళవారం ఆయన పరిశీలించి మొక్క నాటారు. అనంతరం కాలనీల్లో పర్యటించి, పారిశుధ్యం తీరును పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు కంపోస్టు ఎరువుల వినియోగం, పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. అనంతరం మునిసిపల్ కార్యాలయంలో సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా పట్టణంలో చేపట్టిన కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు మునిసిపాలిటీలో కొందరు అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టినట్లు తమ దృష్టికి వచ్చిందని, వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పన్నుల వసూలులో నిర్లక్ష్యం తగదని హెచ్చరించారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు వేగవంతం చేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. పట్టణాల్లో విరివిగా మొక్కలు నాటి సంరక్షించేలా స్థానికులకు అవగాహన కల్పించాలని సూచించారు.

తడి పొడి చెత్తపై ప్రజ లకు అవగాహన కల్పించాలని, వర్మీ కంపోస్టు తయారు చేసి విక్రయిస్తే మునిసిపాలిటీకి ఆదాయం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు మునిసిపల్ కమిషనర్ శశిధర్, మేనేజర్ భూపాల్, వార్డు ఆఫీసర్లు అశోక్, పావని తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితుల సమ్మతితోనే భూసేకరణ

» తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం



కానుకుర్తి భూ నిర్వాసితుల సదస్సులో మాట్లాడుతున్న హైకోర్టు న్యాయవాది ప్రశాంత్

దామరగిద్ద, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : నిర్వాసితులు సమ్మతించిన తరువాతే భూ సేకరణ చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, తెలంగాణ హైకోర్టు న్యాయవాది ప్రశాంత్ అన్నారు. ప్రజాభిప్రాయం లేకుండా ప్రభుత్వం భూసేకరణ చేయడం చట్ట విరుద్ధమని తెలిపారు. నారాయణపేట జిల్లా, దామరగిద్ద మండలంలోని కానుకర్తి గ్రామంలో మంగళవారం నిర్వహించిన భూ నిర్వాసితుల సదస్సులో వారు మాట్లాడారు. నారాయణపేట - కొడంగల్ ఎత్తిపోతల పథకం నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. బహిరంగ మార్కెట్‌కు అనుగుణంగా ధర నిర్ణయించేందుకు న్యాయ కమిషన్ వేయాలన్న నిర్వాసితుల డిమాండ్ సరైనదేనన్నారు. రైతుల భూమిని లాక్కోవడమే పనిగా పెట్టుకుంటే ప్రజా సంఘాలు, ప్రజాస్వామ్య వాదులు భూ నిర్వాసితులకు అండగా నిలబడతారని స్పష్టం చేశారు. ఎకరానికి బేసిక్ ధర రూ. 20 లక్షలు నిర్ణయించి, భూసేకరణ చట్టం ప్రకారం మూడింతలు పెంచి రూ. 60 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సదస్సులో నిర్వాసితుల సంఘం అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి, మాజీ ఎంపీపీ వెంకట్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్యగౌడ్, గ్రామ నాయకులు మోహన్, భీంరెడ్డి, బసిరెడ్డి పాల్గొన్నారు.

వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

» అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేత
» వాల్మీకి సంఘం నియోజకవర్గ కమిటీ ఎన్నిక
» అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా రాజ్ కుమార్, కృష్ణమనాయుడు



కొల్లాపూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వాల్మీకి బోయలు

కొల్లాపూర్ , జూలై 29 (ఆంధ్రజ్యోతి) : తమను ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకి బోయలు డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ పట్టణంలో మంగళవారం ద్విచక్రవాహనాలతో ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో బాణసంచా కాల్చి హక్కుల సాధన కోసం నినదించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఆ తర్వాత పట్టణంలోని మహబూబ్‌ఫంక్షన్ హాల్‌లో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు మునిసిపల్ ఎన్నికల్లో వాల్మీకి బోయలకు ప్రత్యేక వాటా కేటాయించాలని డిమాండ్ చేశారు. వాల్మీకి బోయ యువతీ యువకులకు 90 శాతం సబ్సిడీతో షరతులు లేకుండా రుణాలు అందించాలన్నారు. వాల్మీకీ బోయలకు న్యాయం చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు.

నియోజకవర్గ కమిటీ ఎన్నిక

వాల్మీకి బోయట సంఘం కొల్లాపూర్ నియోజకవర్గ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా చిన్నంబావి మండలం పెద్దమారూర్ గ్రామానికి చెందిన పసుపుల రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా కొల్లాపూర్ పట్టణానికి చెందిన బోగిమల్ల కృష్ణమనాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా ప్రసాద్ నాయుడు, కోశాధికారిగా సుధాకర్ నాయుడు లతో పాటు మండలానికి ఇద్దరు ఉపాధ్యక్షుల చొప్పున అవకాశం కల్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటేశ్ నాయుడు, మాజీ సర్పంచులు గోపాల్ నాయుడు, హుస్సేన్ నాయుడు, తిరుపతయ్య నాయుడు, నాయకులు గోపాల్, గడ్డ బస్వాపురం సుధాకర్, కర్ణ నాయుడు, వెంకటేశ్ నాయుడు, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సత్యం, కల్వరాల నరసింహ, మినుగ పరశురాంనాయుడు, మల్లయ్య నాయుడు, సీపీ నాయుడు, చిన్న కురుమయ్య, రఘు నాయుడు, గోవర్ధన్ నాయుడు, గడ్డం పురుషోత్తమ నాయుడు, కృష్ణ నాయుడు, సురేశ్ నాయుడు పాల్గొన్నారు.

మొక్కజొన్న కంకుల పొట్టుతో పెన్నుల తయారీ

» జాతీయ స్థాయికి ఎంపికైన ప్రాజెక్టు
» జోగుళాంబ గద్వాల జిల్లా విద్యార్థుల ప్రతిభ

గద్వాల సర్కిల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, గద్వాల మండలంలోని అనంతపురం జడ్‌పీహెచ్ఎస్ విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ చాటారు. వారు మొక్కజొన్న కంకుల పైపొట్టుతో తయారు చేసిన పెన్నులు (ఎకో ఫ్రెండ్లీ కార్న్ హస్క్ పెన్) జాతీయ స్థాయికి ఎంపికయ్యాయి. 2024-25 విద్యా సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆన్‌లైన్ వేదికగా మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్, ఇన్నోవేషన్ సెల్ నిర్వహించిన స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్‌లో విద్యార్థులు ప్రతిభచాటారు. వారు తయారు చేసిన ఎకో ఫ్రెండ్లీ కార్న్ హస్క్ పెన్ (పర్యావరణహిత పెన్ను) ఆవిష్కరణ ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపికైనట్లు జిల్లా సైన్స్ అధికారి భాస్కర్ పాపన్న తెలిపారు. ఆన్‌లైన్ వేదిక ద్వారా ఎంపికైన ప్రాజెక్టును ఢిల్లీలో సోమవారం నిర్వహించిన ఎన్ఈవో - 2025 వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను, ప్రోత్సహించిన గైడ్ టీచర్ జానకమ్మను ఇన్‌చార్జి డీఈవో మహమ్మద్ అబ్దుల్ ఘనీ, జిల్లా సైన్స్ భాస్కర్ పాపన్న, గద్వాల ఎంఈవో శ్రీనివాస్‌గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో ప్రత్యేకంగా అభినందించారు.

పీయూలో కొనసాగుతున్న శిక్షణ

పాలమూరు యూనివర్సిటీ, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో పాలమూరు యూనివర్సిటీలో బీఈడీ అధ్యాపకులకు నిర్వహిస్తున్న ఏడు రోజుల శిక్షణ కొనసాగుతోంది. సామాజిక మరియు భావోద్వేగ అభ్యసన శిక్షణలో భాగంగా 'పిల్లల ఎదుగుదలలో సామాజిక మరియు భావోద్వేగ అభ్యసన పాత్ర' అంశంపై మంగళవారం రెండవ రోజు శిక్షణ ఇచ్చారు. పిల్లలు పుట్టినప్పటి నుంచి 1000 రోజులు ఎందుకు కీలకమైనవి, అభిజ్ఞాన వికాసం, సామాజిక భావోద్వేగ వికాసాల మధ్య సంబంధం, వ్యక్తిగత, సామాజిక శ్రేయస్సును ప్రోత్సహించడం అంశాలపై శిక్షకులు అధ్యాపకులకు వివరించారు. అనంతరం గ్లోబల్ సెంటర్ ఫర్ ది డెవలప్‌మెంట్ ఆఫ్ ది వరల్డ్ చైల్డ్ రూపొందించిన వీడియోలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కరుణాకర్‌రెడ్డి, కోకన్వీనర్ డాక్టర్ బషీర్ అహ్మద్, కమిటీ సభ్యులు డాక్టర్ జయనాయక్, డాక్టర్ విజయలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం బిల్లులు మంజూరు

» వంట కార్మికులకు గౌరవ వేతనం కూడా..



దామరగిద్ద మండలంలో వంట వండుతున్న ఏజెన్సీలు

నారాయణపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజనం బిల్లులతో పాటు, వంట కార్మికులకు గౌరవ వేతనాన్ని కూడా విడుదల చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి 8వ తరగతి వరకు ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి, మధ్యాహ్న భోజనం బిల్లులను విడుదల చేసింది. అలాగే వంట కార్మికులకు మూడు నెలల గౌరవ వేతనం చెల్లింపునకు నిధులు మంజూరు గౌవర వేతనం వేయ్యిరూపాయలు ఏప్రిల్, మే, జూన్ వరకు ముడు నేలలవి నిధులు ఇచ్చింది. ఈ మేరకు ప్రొసీడింగ్ నెంబర్ 08, పీఎం పోషణ్, 2025 జూలై 29న ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు మంగళవారం రాత్రి నారాయణపేట జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి అందాయి.

మంజూరైన నిధులు

జిల్లా	మధ్యాహ్న భోజనం బిల్లులు	వంట కార్మికులకు గౌరవ వేతనం	మొత్తం
నారాయణపేట	1,77,34,375	3,087000	2,08,21,375
మహబూబ్‌నగర్	95,16,156	31,14,700	1,26,30,856
జోగుళాంబ గద్వాల	1,16,79,592	24,59,000	1,38,28,592
నాగర్‌కర్నూల్	1,07,94,928	42,14,000	1,50,08,928
వనపర్తి	1,03,30,061	3366000	1,36,96,061
మొత్తం	6,00,55,112	1,62,40,700	7,59,85,812

క్రైం కార్నర్

వ్యక్తి అనుమానాస్పద మృతి

జడ్చర్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల పట్టణంలోని ఇందిరానగర్‌కాలనీకి చెందిన లట్టుపల్లి రామకృష్ణ(25) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపిన వివరాల మేరకు... వనపర్తి జిల్లా, ఖిల్లాఘణపురం మండలంలోని అప్పటిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన లట్టుపల్లి రామకృష్ణ నాలుగు సంవత్సరాల క్రితం ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. రెండు సంవత్సరాల క్రితం అతడి జడ్చర్లలోని ఇందిరానగర్ కాలనీలో ఓ మహిళతో సహజీవనం చేస్తున్నట్లు కుటుంబ సభ్యులకు తెలిసింది. దీంతో వారు అతడిని తీసుకెళ్లారు. మూడు నెలల అనంతరం రామకృష్ణ ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం రామకృష్ణ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. మృతదేహం బాదేపల్లి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ఉందని తెలిసింది. దీంతో వారు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. తన కుమారుడి మెడపై కమిలిన గాయాలున్నాయని, అతడి మృతిపై అనుమానం ఉదంటూ తండ్రి వెంకటయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడ్తున్నట్లు సీఐ తెలిపారు.

పెద్దపులి దాడిలో ఆవు మృతి

మన్ననూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, నల్లమల అభయారణ్యం ప్రాంతంలో ఆవుపై పెద్దపులి దాడి చేసి చంపేసింది. అమ్రాబాద్ మండలంలోని మన్ననూరు గ్రామానికి చెందిన రైతు రామావత్ ముఖేశ్‌కు చెందిన ఆవును నాలుగు రోజుల క్రితం మందతో కలిసి ఉమామహేశ్వర క్షేత్రానికి వెళ్లే పశువుల డొంకకు పంపించారు. ముఖేశ్‌కు చెందిన ఆవు ఇంటికి తిరిగి రాకపోవడంతో పశువుల డొంకలో పరిశీలించగా, కళేబరం కనిపించింది. దాని విలువ రూ.60 వేలు ఉంటుందని పేర్కొంటూ, మన్ననూరు అటవీ శాఖ రేంజ్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. దీంతో అటవీ బీట్ అధికారి కళేబరాన్ని పరిశీలించి, పంచనామా నిర్వహించారు.

కాల్వ నీటి విషయంలో గొడవ

» ఇరువురిపై కేసు నమోదు

శ్రీరంగాపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా శ్రీరంగాపురం మండల పరిధిలోని శేరుపల్లి గ్రామంలో నీటి విషయంలో ఎల్లమ్మ ఆమె కుమారుడు పొలంలో పని చేస్తుండగా ఆమె మరిది చిన్న హనుమంతు కొడుకు కురుమన్న ఎల్లస్వామిపై దాడి చేయగా తలకు రక్త గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కర్నూల్ ఆసుపత్రికి తరలించామని మంగళవారం ఎస్‌ఐ తెలిపారు. ఎల్లస్వామి తల్లి ఎల్లమ్మ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు. అదే విధంగా కురుమన్న తనపై దాడి చేశాడని ఫిర్యాదు చేయడంతో ఎల్లస్వామిపై కూడా కేసు నమోదు చేశామని తెలిపారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి అదృశ్యం


హీరు (ఫైల్)

అచ్చంపేట టౌన్/ రాజాపూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఓ యువతి, మరో వ్యక్తి అదృశ్యం అయ్యారు. ఎస్‌ఐలు విజయభాస్కర్, శివానందం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట పట్టణంలోని మారుతీనగర్ కాలనీకి చెందిన నెల్లికంటి రామకృష్ణ కుమార్తె సోమవారం ఉదయం తెల్లవారుజామున కాలకృత్యాలకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా కనిపించకపోవడంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. జూపల్లి గ్రామానికి చెందిన కనగంటి శేఖర్‌పై తమకు అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

● మహబూబ్‌నగర్ జిల్లా, రాజాపూర్ మండల పరిధిలోని నాన్‌చేరువు తండాకు చెందిన హీరు(45) అనే వ్యక్తి ఆదివారం అదృశ్యం అయ్యాడు. స్నేహితులు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం అతడి భార్య చంద్రకళ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే ఇంట్లో పాము పట్టివేత


పామును పట్టుకున్న స్నేక్ సొసైటీ అధ్యక్షుడు కృష్ణసాగర్

కొత్తకోట, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని కానాయపల్లి గ్రామంలోని మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్‌రెడ్డి ఇంట్లో పాము సంచరించడంతో మంగళవారం స్నేక్ సొసైటీ చైర్మన్ కృష్ణసాగర్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన తన బృందంతో వెళ్లి పామును సురక్షితంగా బంధించారు. అనంతరం పట్టుకున్న పామును గుంపుగట్టు గుట్టల్లో వదిలినట్లు తెలిపారు.

జన్మభూమి రుణం తీర్చుకోవాలి

» విద్యాభివృద్ధికి వెంకటరెడ్డి కృషి అభినందనీయం

» వైస్ ఎంపీపీ నిర్మల


ఎన్‌ఆర్‌ఐ గడ్డంపల్లి వెంకటరెడ్డిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కందనూలు, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : జీవితంలో స్థిరపడ్డ తర్వాత జన్మభూమి రుణం సాధ్యమైనంత వరకు తీర్చుకోవాలని మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు నిర్మల అన్నారు. మంతటి గ్రామానికి చెంది న గడ్డంపల్లి వెంకటరెడ్డి ఎన్‌ఆర్‌ఐ. ఆయన మంతటి జడ్పీహెచ్‌ఎస్ పూర్వ విద్యార్థి. పాఠశాలపై అభిమానం, మాతృభూమిపై మమకారంతో రూ.20 లక్షలకుపైగా పాఠశాలకు వివిధ సదుపాయాలు వెంకటరెడ్డి కల్పించారు. దీంతో మంగళవారం మంతటి పాఠశాలలో ఆయనను అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుపతిరెడ్డి అధ్యక్షతన ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం నిర్మల మాట్లాడుతూ పుట్టిన ఊరు, చదువుకున్న పాఠశాలను ఎప్పటికీ మరిచిపోవద్దన్నారు. పాఠశాలలో బాలురు, బాలికల కోసం ప్రత్యేకంగా మూత్రశాలలు, వాష్‌రూమ్‌లు ఏర్పాటు చేయించారు. అంతేకాక తరగతి గదుల్లో ఇనుప బెంచీలు, ఫ్యాన్లు, పాఠశాల రికార్డులు భద్రపర్చడానికి బీరువాలు ఏర్పాటు చేయించారు. రెండు ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు దుస్తులు, గ్రామపంచాయతీ సిబ్బందికి డ్రస్సులు అందించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్‌రావు, మాజీ సర్పంచ్ సి.నాగయ్య, గ్రామ ప్రముఖులు జానకిరాములు, మల్లయ్య, వెంకటస్వామి, వెంకటయ్య, ఉపాధ్యాయ బృందం గుడిపల్లి నిరంజన్, శంషీద్దీన్, జాన్య, రామకృష్ణ, సందీప్, శైలజరావు, రమేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అమ్మ పాలు అమృతం

» తాగిస్తే బిడ్డకు, తల్లికీ రక్ష

» ఆగస్టు 1 నుంచి 7 వరకు తల్లిపాల వారోత్సవాలు


అంగన్వాడీ సెంటర్లో చిన్నారులు

వనపర్తి రూరల్ , జూలై 29 (ఆంధ్రజ్యోతి) : అమ్మ పాలు అమృతంతో సమానమని పెద్దలు చెప్తారు. తల్లి పాలు బిడ్డకు వరమని, ఎదుగుదలకు అవసరమైన అన్ని పోషకాలను అందించి వ్యాధుల బారిన పడకుండా కాపాడే అమృతమని వైద్యులు చెప్తున్నారు. తల్లిపాలు పట్టిస్తేనే శిశువుకు సంపూర్ణ ఆరోగ్యం, రోగ నిరోధక శక్తి పెంపొందుతుంది. ఇంతటి విశిష్టత కలిగిన తల్లిపాలను బిడ్డకు ఎంత వయసు వచ్చే వరకు ఇవ్వాలి, రోజుకు ఎన్నిసార్లు, ఎలా పట్టాలి, తల్లి పాలు పుష్కలంగా లభించాలంటే ఎలాంటి ఆహారం తీసుకోవాలి, ముర్రుపాల ప్రాధాన్యం ఏమిటి తదితర విషయాలపై అందరికీ అవగాహన ఉండదు. ఈ విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించి, తల్లిపాల ప్రాధాన్యాన్ని తెలిపేందుకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వచ్చేనెల 1 నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహించనున్నారు.

వనపర్తి జిల్లాలో 20,320 మంది చిన్నారులు

వనపర్తి జిల్లాలో 15 మండలాలు ఉండగా, ఆత్మకూరు, పెబ్బేరు, వనపర్తి ఐసీడీఎస్ ప్రాజెక్టులున్నాయి. వాటి పరిధిలో 589 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. జిల్లా వ్యాప్తంగా 1,519 మంది బాలింతలు, 2,466 గర్భిణులు, 20,320 మంది చిన్నారులు ఉన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా వారందరికీ అవగాహన కల్పించనున్నారు.

ముర్రుపాలు తప్పనిసరి

బిడ్డ పుట్టిన మొదటి అరగంట లోపు తల్లులకు వచ్చే ముర్రుపాలను శిశువుకు తప్పనిసరిగా పట్టించాలి. దీని వలన రోగ నిరోధక శక్తి పెరగడమే కాకుండా బిడ్డకు సమతుల్యమైన పోషకాహారం అందుతుంది. ఈ పాలలో మాంసకృతులు, విటమిన్ ఏ పుష్కలంగా ఉంటుంది. బిడ్డ పుట్టిన గంట నుంచి ఆరు నెలల వరకు తల్లిపాలు తప్ప మరే ఇతర ఆహారం ఇవ్వకూడదు. తల్లిపాలు మాత్రమే బిడ్డకు తేలికగా అరుగుతాయి. శుభ్రంగా ఎటువంటి క్రిములు లేకుండా ఉంటాయి. శ్వాసకోశ, అలర్జీ, అస్తమా, చర్మవ్యాధుల నుంచి చిన్నారులను రక్షిస్తాయి. బిడ్డ మానసిక, శారీరక వికాసానికి అవసరమైన పోషకాలు అందిస్తాయి. ప్రతీ రోజు బిడ్డకు 8 నుంచి 10 సార్లు పాలు ఇవ్వాలి. ఆరు మాసాల తరువాత బిడ్డకు తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారం ఇవ్వాలి.

రెండేళ్ల వరకు క్రమం తప్పకుండా పాలు పట్టాలి. దీని వల్ల బిడ్డ ఎదుగుదల సక్రమంగా ఉంటుంది. పాలు పుష్కలంగా రావాలంటే గర్భం దాల్చినప్పటి నుంచే పోషక విలువలు ఉన్న ఆహారం, పాలు, చేపలు, గుడ్లు, తాజా కూరగాయలు, పండ్లు తగిన మోతాదులో తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

బిడ్డకు అమిత ప్రయోజనం

తల్లిపాలు శిశువుకు సంపూర్ణమైన సంతులిత ఆహారాన్ని అందిస్తాయి. నాణ్యమైన ప్రోటీన్లు ఒమేగా 3, అలాగే బిడ్డ మెదడు వికాసానికి తోడ్పడుతాయి. పాలలో విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. ఇందులోని లాక్టోజ్ వల్ల కాల్షియం నిల్వలు పెరుగుతాయి. నెలల శిశువులకు వివిధ రకాల అంటు వ్యాధుల నుంచి కాపాడుతాయి.

మలబద్దకం సమస్య నివారణకు తోడ్పడు తాయి. జీర్ణ మండలాన్ని శుద్ధి చేస్తాయి. తల్లిపాల ద్వారా బిడ్డలను డయోరియా, న్యూమోనియా వంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చు. బాల్యం, యవ్వనంలో ఊబకాయం వచ్చే అవకాశం తక్కువగా ఉంటుంది.

తల్లి ఆరోగ్యానికి రక్షణ

తల్లులు చనుబాలు ఇవ్వడం వల్ల కాన్పు తరువాత రక్తస్రావ ప్రమాదం తగ్గడంతో పాటు త్వరగా కోలుకుంటారు. జీవితాంతం ఆరోగ్యంగా ఉంటారు. చనుబాలు ఇచ్చినందువల్ల ఊబకాయం వచ్చే అవకాశం తగ్గుతుంది. గర్భానికి పూర్వం ఉన్న బరువును తిరిగి పొందగలుగుతారు.

బిడ్డకు పాలు పట్టించడం వల్ల రొమ్ము, గర్భసంచి క్యాన్సర్లు దరి చేరవు. తల్లులకు మలి వయసులో వచ్చే ఆస్టియో, పోరోసిస్ (ఎముకల బలహీనత) నుంచి రక్షణ కలుగుతుంది. ముఖ్యంగా తల్లి బిడ్డల మధ్య బంధాన్ని పెంపొందిస్తుంది. తల్లికి, శిశువుకు జ్వరం వచ్చినా, టీకాలు వేసినా కూడా పాలు పట్టించవచ్చు.

ప్రతీ ఏటా వారోత్సవాలు



ప్రతి ఏటా ఆగస్టు మొదటివారంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తారు. ఈ సందర్భంగా అమ్మపాల విశిష్టతను తెలిపేలా అవగాహన సదస్సులను నిర్వహిస్తాం. గర్భిణులు, బాలింతలు తల్లిపాల విశిష్టతను తప్పకుండా తెలుసుకోవాలి. పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వలన పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.

- సుధారాణి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి

హెచ్‌సీఏ-2లీగ్‌లో రాణించిన జిల్లా క్రీడాకారులు

» సెంచరీతో రాణించిన అబ్దుల్‌రాఫె


సెంచరీతో రాణించిన అబ్దుల్‌రాఫె

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) 2 లీగ్ టోర్నీలో జిల్లా జట్టు క్రీడాకారులు రాణించారు. హైదరాబాద్, వెస్ట్‌మారెడ్‌పల్లిలోని త్యాగీ క్రికెట్ మైదానంలో మంగళవారం నిర్వహించిన లీగ్ మ్యాచ్‌లో బ్యాటింగ్ చేసిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జట్టు మొదటి ఇన్నింగ్‌లో 85.1 ఓవర్లలో 300 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జట్టులో అబ్దుల్ రాఫె 194 బంతుల్లో 10 ఫోర్లలతో (111) సెంచరీ సాధించాడు. సంజయ్ 63 బంతుల్లో 7 ఫోర్ల(53) అర్ధసెంచరీతో రాణించారు. కేతన కుమార్ 43, కే. శ్రీకాంత్ 39 అక్షయ్ 20 పరుగులు చేశారు. బ్యాటింగ్‌లో రాణించిన జిల్లా క్రీడాకారులు జిల్లా క్రికెట్ సంఘం సెక్రటరీ ఎం. రాజశేఖర్ అభినందించారు. టోర్నీలో ప్రతిభ చాటితే రాష్ట్ర జట్టులో చోటు లభిస్తుందని క్రీడాకారులకు సూచించారు.

బావి మోటారు చోరీ

ఊర్కొండ, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : పొలంలోని బావి మోటరును గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. నాగర్‌కర్నూల్ జిల్లా, ఊర్కొండ మండలం, గుడిగానిపల్లి గ్రామానికి చెందిన రైతు జక్కా కృష్ణారెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామ శివారులో ఆయన పొలంలోని బావి వద్దనున్న మోటార్‌తో పాటు, స్టార్టర్, విద్యుత్ తీగలను సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ మేరకు ఆయన మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణదేవ తెలిపారు.

వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

» రక్తం నిల్వలను సిద్ధంగా ఉంచుకోవాలి

» మందుల కొరత తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

» టీజీఎంఎస్ఐడీసీ ఎండీ ఫణీంద్రరెడ్డి


వైద్యాధికారులతో సమీక్షిస్తున్న ఫణీంద్రరెడ్డి

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో వైద్యులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని వైద్యసేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ (టీజీఎంఎస్ఐడీసీ) మేనేజింగ్ డైరెక్టర్ ఫణీంద్రరెడ్డి ఆదేశించారు. సీజనల్ వ్యాధుల పర్యవేక్షణ, నియంత్రణ చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాలకు ఐఏఎస్ అధికారులను ఇన్‌చార్జీలుగా నియమించింది. అందులో భాగంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు ఇన్‌చార్జిగా నియమితులైన ఫణీంద్రరెడ్డి మంగళవారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని తనిఖీ చేశారు. మహిళలు, పురుషుల వార్డులు, వంటశాల, పాటు, ల్యాబులు, బ్లడ్ బ్యాంకులను పరిశీలించారు. అనంతరం జిల్లా వైద్యాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశానికి టీజీఎంఎస్ఐడీసీ కార్యనిర్వాహక అధికారి కౌటిల్యతో కలిసి హాజరయ్యారు. జిల్లాలో వర్షాలు ఏకధాటిగా కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. గతంలో వ్యాధులు ఎక్కువగా వ్యాప్తి చెందిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక కార్యాచరణను రూపొందించుకొని, దాని ప్రకారం పని చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా వ్యాధి బాధితులకు ప్లేట్‌లెట్లు తగ్గిపోయే ప్రమాదం ఉంటుందని, అందుకోసం బ్లడ్ బ్యాంకుల్లో సరిపడా రక్తం నిల్వలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. రక్తదాతలను కూడా అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందుల కొరత లేకుండా చూడాలని, ఏవైనా మందులు లేకపోతే వెంటనే ప్రతిపాదనలు పంపించాలన్నారు. ఆసుపత్రి పరిసరాలతో పాటు జనావాసాలు కూడా పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. అనంతరం ఆయన పట్టణంలోని సుశ్రుత ప్రైవేటు ఆసుపత్రిని పరిశీలించి, రోగులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. సమీక్ష సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణ, జనరల్ ఆసుపత్రి సూపరింటెండెట్లు డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్, డాక్టర్ మాధవి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ భాస్కర్ నాయక్, డాక్టర్ శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి

మహబూబ్‌నగర్ పట్టణంలో వెయ్యి పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని టీజీఎంఎస్ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఫణీంద్రరెడ్డి ఆదేశించారు. జిల్లా వైద్యాధికారులతో సమీక్షా సమావేశం అనంతరం ఆయన వెయ్యి పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. పెండింగ్ పనులపై ఆరా తీశారు. ఈవీఎం గోదాముపై ఉన్నతాధికారులతో మాట్లాడతానని చెప్పారు. పనులను త్వరగా పూర్తి చేసి, ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. ఆయన వెంట కార్యనిర్వాహక కార్యదర్శి కౌటిల్య, ఈఈ వేణుగోపాల్, ఏఈ శరత్ ఉన్నారు.

గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలి

» ప్రత్యేకాధికారి శ్రీనివాసులు


పులిగుట్ట వద్ద ఏర్పాటు చేసిన బోనును పరిశీలిస్తున్న శ్రీనివాసులు

కోయిలకొండ, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, కోయిలకొండ మండలంలోని కోతలాబాద్‌తో పాటు పులిగుట్ట సమీపంలోని గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసులు సూచించారు. గొర్రెల కాపరులపై చిరుత దాడి చేసిన ప్రాంతాలను మంగళవారం ఆయన పరిశీలించి స్థానికులు, రైతులతో మాట్లాడారు. రాత్రిళ్లు పొలాల వద్దకు వెళ్లొద్దని సూచించారు. చిరుతను బంధించేందుకు పులిగుట్ట వద్ద అటవీశాఖ అధికారులు రెండు బోన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాగా సోమవారం రాత్రి కొందరు గ్రామస్థులు పులిగుట్ట ప్రాంతంలో చిరుత జాడ కోసం గాలించారు. ఇటీవల చిరుత దాడిలో గాయపడిన గొర్రెల కాపరి, రైతులు మంగళవారం ఆసుపత్రిని నుంచి డిశ్చార్జి అయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీవో కాళప్ప, ఏపీవో నర్సయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సత్యానారాయణగౌడ్, కార్యదర్శి విష్ణు పాల్గొన్నారు.

155 సైలెన్సర్ల ధ్వంసం


రోడ్డురోలర్‌తో సెలెన్సర్‌లను తొక్కిస్తున్న దృశ్యం, చిత్రంలో ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మోడిఫైడ్ సైలెన్సర్లపై పోలీసులు కొరడా ఝుళిపించారు. కొందరు తమ బైక్‌లకు కంపెనీ అమర్చిన సెలెన్సర్లను తొలగించి, నిబంధనలకు విరుద్ధంగా మోడిఫైడ్ సైలెన్సర్లను బిగించుకున్నారు. ఇటీవల ట్రాఫిక్ పోలీసులు, పోలీసులు తనిఖీలు నిర్వహించి వాటిని తొలగించి స్వాధీనం చేసుకున్నారు. ఇలా తొలగించిన 155 సెలెన్సర్‌లను మంగళవారం నగర సమీపంలోని మైదాన ప్రాంతంలో వరుసగా పేర్చి రోడ్డురోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. కార్యక్రమాన్ని ఎస్పీ జానకి దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా మోడిఫై చేసిన సెలెన్సర్లతో విపరీతమైన శబ్దకాలుష్యం ఏర్పడుతుందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా సైలెన్సర్లను అమర్చిన మెకానిక్‌లపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఇన్‌స్పెక్టర్ భగవంత్‌రెడ్డి, రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతో పెద్ద పులుల సంరక్షణ

» ఫ్లయింగ్ స్క్వాడ్, ఎఫ్‌డీవో రామ్మోహన్


అవార్డులు అందుకున్న అటవీ శాఖ ఉద్యోగులు

మన్ననూర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజల భాగస్వామ్యంతోనే అమ్రాబాద్ టైగర్ రిజర్వులో పెద్దపులుల సంరక్షణ సాధ్యమవుతుందని ఫ్లయింగ్ స్క్వాడ్, అటవీ శాఖ డివిజన్ అధికారి, రామ్మోహన్ అన్నారు. ప్రపంచ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకొని అమ్రాబాద్ మండలంలోని మన్ననూరులో అటవీశాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా మన్ననూరు చెక్‌పోస్టు నుంచి దుర్వాసుల చెరువు చెక్‌పోస్టు వరకు పులుల సంరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వ హించారు. తుర్కపల్లి బేస్ క్యాంపు ఆవరణలో మొక్కలు నాటారు. శ్రీశైలం హైదరాబాద్ రహదారి వెంట ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి రీ సైకిలింగ్ కేంద్రానికి తరలించారు. మన్ననూ రులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశా లలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. టైగర్‌ట్రాకింగ్, అగ్ని ప్రమాదాల నివారణ, నివాస అభివృద్ధి, నేరస్థుల గుర్తింపు, వ న్యప్రాణుల సంరక్షణ తదితర అంశాల్లో కృషి చేసిన ఆరుగురు ఉద్యోగులకు రాష్ట్ర స్థాయి, మన్ననూరు డివిజన్ కార్యాలయం పరిధిలో 17 మందికి ప్రతిభా పురస్కారాలను అందించారు. కార్యక్రమంలో రేంజ్ అధికారులు దేవరాజ్, వీరేశ్, గురుప్రసాద్, సెక్షన్ బీట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విరివిగా రుణాలు ఇవ్వాలి

» సెర్ప్ బ్యాంక్ లింకేజీ డైరెక్టర్ వైఎన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సెర్ప్ బ్యాంక్ లింకేజీ డైరెక్టర్ వైఎన్‌రెడ్డి

మహబూబ్‌నగర్ అర్బన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మహిళా సంఘాలకు విరివిగా రుణాలు ఇవ్వాలని సెర్ప్ బ్యాంక్ లింకేజీ డైరెక్టర్ వైఎన్‌రెడ్డి బ్యాంకర్లను ఆదేశించారు. ఉమ్మడి జిల్లా డీపీఎం, ఏపీఎంలతో మహబూబ్‌నగర్ కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశపు హాల్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడానికి ప్రభుత్వం మహిళ సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఇస్తోందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశానుసారం బ్యాంకర్లు రుణాలు ఇవ్వాలని సూచించారు. మహబూబ్‌నగర్ జిల్లాకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన బ్యాంక్ లింకేజీ రుణలక్ష్యం రూ. 385 కోట్లుగా నిర్దేశించినట్లు తెలిపారు. లక్ష్యం పూర్తి చేసేందుకు బ్యాంకర్లు సహకరించాలన్నారు. మహిళ సంఘాలు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకొని, తిరిగి చెల్లించేలా ఐకేపీ అధికారులు వారికి అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శివేందరప్రతాప్, డీఆర్‌డీవో నర్సింహులు, డీఆర్‌డీవో ఏపీడీ శారద, డీపీఎం లక్ష్మయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ

చట్టాలు ఎవరికీ చుట్టాలు కావు

● పాన్‌గల్ ఎస్ఐ కె.శ్రీనివాసులు



పాన్‌గల్,జూలై 29 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పట్ల ప్రజలు సహకరించాలని, ఎంతటి వారైనా చట్టాన్ని ధిక్కరిస్తే చర్యలు తప్పవని, చట్టాలు ఎవరికీ చుట్టాలు కావని పాన్‌గల్ ఎస్ఐ కె.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలపై మాట్లాడారు.

ప్ర: శాంతి భద్రతలు ఎలా ఉన్నాయి?

జ: శాంతి భద్రతల విషయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవడంలో పోలీస్ పాత్ర కీలకంగా ఉంటుంది. దాని ఫలితంగా మండలంలో శాంతి భద్రతల పట్ల ప్రశాంతంగా ఉంది.

ప్ర: ఆన్‌లైన్ మోసాలపై ప్రజలను ఏ విధంగా అప్రమత్తం చేస్తున్నారు?

జ: సైబర్ క్రైమ్ ఆన్‌లైన్ మోసాల పట్ల పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వివిధ గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం.

ప్ర: యువతకు మీరిచ్చే సందేశం?

జ: యువత చెడు మార్గానికి వెళ్లకుండా సమాజ ప్రయోజనం కోసం తమవంతు కృషి చేయాలి. అలాగే యువత గంజా యి డ్రగ్స్ వాటికి బానిసలు కాకుండా ఉండాలని సూచించారు.

ప్ర: బాల్య వివాహాలు జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: బాల్య వివాహాలను అరికట్టేందుకు గ్రామాల్లో పాఠశాల, కళాశాలలో అవగాహన కల్పిస్తున్నాం. బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలపై వివరించడం జరుగుతుంది. బాల్య వివాహాలను ప్రోత్సహించినా, వివాహం చేసుకున్న వారిపై కఠినంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

న్యూస్ బాక్స్

పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా వెంకటేష్



పద్మశాలి సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

కొత్తకోట, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భక్త మార్కండేయస్వామి ఆలయంలో పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళ వారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మహంకాళి వెంకటేష్, ఉపాధ్యక్షులుగా సంబారి బాలరాజు, చంద్రశేఖర్, మాధన్న ప్రధాన కార్యదర్శిగా సాక బాలరాజు, కోశాధికారిగా సత్యనారాయణతో పాటు 11 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. బాలనారాయణ, నాగరాజు, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

మదనాపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో ఈ నెల 31న ఇంటర్ స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ ఉంటుందని కళాశాల ప్రిన్సిపాల్ ప్రమోద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతిలో 420 మార్కులు పైబడిన అభ్యర్థులు ఉదయం 9 గంటలకు అడ్మిషన్ ప్రక్రియలో పాల్గొనాలని, అడ్మిషన్‌కు వచ్చే వారు పదవ తరగతి మార్క్స్ షీట్, టీసీ, బోనాఫైడ్, కుల, ఆదాయ సర్టిఫికెట్లు, అయిదు ఫోటోలతో రావాలని ఆమె తెలిపారు.

మాదక ద్రవ్యాలు వాడితే అనర్థాలు, అనారోగ్యం

ఆత్మకూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాలు వాడకం వల్ల అనర్థాలు చోటు చేసుకోవడమే కాకుండా అనారోగ్యానికి గురై అర్థాంతరంగా మృతి చెందే అవకాశం ఉందని తిప్పడంపల్లి ప్రాథమిక ఆసుపత్రి వైద్యుడు ఫయాజ్ పేర్కొన్నారు. ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సైదులు అధ్యక్షతన నిర్వహించిన మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమానికి ఆయన మంగళవారం హాజరై మాట్లాడారు. కళాశాల అధ్యాపకులు భాగ్యవర్ధన్‌రెడ్డి, విశ్వేశ్వర్, కురుమూర్తితో పాటు పలువురు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు



మాట్లాడుతున్న విజయభాస్కర్‌రెడ్డి

ఆత్మకూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ సాగుతో రైతులు అధిక లాభాలు సాధించే అవకాశం ఉందని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి విజయభాస్కర్ రెడ్డి అన్నారు. ఆత్మకూరు మండల పరిధిలోని వారిపల్లి గ్రామ రైతు వేదిక భవనంలో సింగిల్‌విండో అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన రైతు సమావేశానికి ఆయన మంగళవారం హాజరై ప్రసంగించారు. రైతులు ఆత్మకూరు మండల పరిధిలోని గ్రామాల్లో వరి సాగు చేస్తున్నారు. దీని ద్వారా రైతులు కొంతమేర లాభాలను అర్జించలేకపోతున్నారు. అనంతరం సింగిల్‌విండో అధ్యక్షుడు గ్రామంలో సాగు చేసిన 40 ఎకరాల్లో ఉన్న ఆయిల్ పామ్ తోటను పరిశీలించారు. మండల వ్యవసాయ అధికారి వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మీరు చదువుకోండి.. వసతులు మేము సమకూరుస్తాం

» ఎమ్మెల్యే మేఘారెడ్డి



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): 'మీరు చదువుకోండి.. వసతులు మేము సమకూరుస్తాం' అని ఎమ్మెల్యే మేఘారెడ్డి విద్యార్థులకు సూచించారు. మంగళవారం వనపర్తి మండల పరిధిలోని మహాత్మా జ్యోతిరావు పూలే తెలంగాణ బీసీ వెల్ఫేర్ పాఠశాలలో నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సన్న బియ్యంతో భోజనాన్ని అందిస్తున్నామన్నారు. విద్యార్థులకే కాదు ప్రజలకు కూడా సన్న బియ్యాన్ని అందిస్తున్నామని అది రేవంత్ రెడ్డికే సాధ్యమని అన్నారు. పాఠశాలలో త్వరలోనే పాఠశాల గ్రౌండ్ ఏర్పాటు చేస్తామన్నారు. ఇటీవల మహాత్మా జ్యోతిబాపూలే కళాశాలకు భవనం లేకపోవడంతో మంత్రి పొన్నం ప్రభాకర్‌రెడ్డితో మాట్లాడానని అన్నారు. త్వరలో నిర్మాణ పనులు చేపట్టేందుకు జీవో కూడా జారీ చేశారన్నారు. ప్రభుత్వ బడులను అమ్మ ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్ది మహిళా సంఘాల సభ్యులకే చైర్మన్ పదవిని ఇచ్చామన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, సాయిచరణ్, డీఈవో అబ్దుల్ ఘని, పాఠశాల ప్రిన్సిపాల్ గురువయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవికిరణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రఘుపతిరావు, బి.కృష్ణ, శంకర్ నాయక్, నాగవరం యాది, వాల్యా నాయక్, ఎత్తం రవికుమార్, కర్ణాకర్, వెంకటేష్, కుమార్, నరసింహ, రాముపాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే



రేషన్‌కార్డులను అందజేస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని బీవీఆర్ గార్డెన్‌లో లబ్ధిదారులకు రేషన్ కార్డులు, కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2006 కాంగ్రెస్ ప్రభుత్వంలో దివంగత రాజశేఖర్‌రెడ్డి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇస్తే మళ్లీ ఇప్పుడు ఇవ్వడం జరుగుతుందన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న నాయకులు కమిషనులు వచ్చే పనులకే ప్రాధాన్యం ఇచ్చారని ఆరోపించారు.

కలెక్టర్ మాట్లాడుతూ చాలా ఏళ్లుగా రేషన్ కార్డులు ఇవ్వక పోవడంతో కొందరికి బియ్యం అందించలేక పోయమన్నారు. దొడ్డు బియ్యం దుర్వినియోగం అవుతున్నాయనే సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. అంతకుముందు బాలికల ఉన్నత పాఠశాలలో వన మహోత్సవంలో పాల్గొన్నారు. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సివిల్ సప్లయ్ జిల్లా అధికారి కాశీ విశ్వనాథ్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, మునిసిపల్ కమిషనరు సైదయ్య, ఎంపీడీవో కృష్ణయ్య నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి బోయోజ్, బీచుపల్లి యాదవ్, శ్రీనివాసులు, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ బాబు, నరేందర్‌రెడ్డి, రమణ, సాయిరెడ్డి, శివరాజ్, ఉమామహేశ్వర్‌రెడ్డి, సాయులు యాదవ్, వెంకటేశ్వర్‌రెడ్డి, శివరాములు, రాంలాల్ నాయక్, బాలరాజు యాదవ్ పాల్గొన్నారు.

రోగులకు రక్త పరీక్షలు నిర్వహించాలి

» కలెక్టర్ ఆదర్శ్ సురభి



మదనాపురంలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

మదనాపురం/కొత్తకోట/వనపర్తి రాజీవ్ చౌరస్తా , జూలై 29 (ఆంధ్రజ్యోతి) : జ్వరం, దగ్గుతో వచ్చే రోగులకు రక్త పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. అక్కడికి మెడికల్ ఆఫీసర్, జిల్లా వైద్యాధికారి ఆలస్యంగా రావడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరోగ్య కేంద్రంలో ఉన్న మందుల నిల్వలు, ఈడీడీ రిజిష్టర్‌ను పరిశీలించారు. గర్భిణుల ఏఎన్‌సీ పరీక్షలు సకాలంలో నిర్వహించి సాధారణ ప్రసవాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాము, కుక్క కాటుకు సంబంధించిన వ్యాక్సిన్ మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.శ్రీనివాసులు, తహసీల్దార్ మోహన్, ఎంపీడీవో ప్రసన్నకుమారి, ఏవో గాయత్రి పాల్గొన్నారు.

అవసరమైన మేరకే ఎరువులు ఇవ్వాలి

ఎరువుల దుకాణదారులు రైతులకు అవసరమైన మేరకే ఎరువులు ఇవ్వాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం కొత్తకోటలోని సంకల్ప్, మన గ్రోమోర్ ఎరువుల దుకాణాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా యజమానులతో కలెక్టర్ మాట్లాడుతూ దుకాణంలో ఎరువుల నిల్వల వివరాలు, ధరలు బోర్డుపై కచ్చితంగా రాయలన్నారు. అనంతరం గోదాంలోని డీఏపీ, యూరియా, జిప్సంతో పాటు క్రిమిసంహారక మందులను పరిశీలించారు. ఏడీఏ దామోదర్, ఏవో జాస్మిన్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

కోర్సులు సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో డిమాండ్ ఉన్న వృత్తి విద్యా కోర్సుల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు అడ్మిషన్లు జరుగుతున్నాయని ఆసక్తి గల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి విజ్ఞప్తి చేశారు. మంగళవారం కలెక్టర్ తన ఛాంబర్‌లో ప్రభుత్వ ఐటీఐ , అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్‌కు సంబంధించిన వాల్ పోస్టర్‌ను సంబంధిత శాఖల అధికారులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. వనపర్తి జిల్లాలో మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్ (40సీట్లు), మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్ 24 సీట్లు, బేసిక్ డిజైనర్ , వర్చువల్ వెరిఫైయర్ మెకానికల్ 24 సీట్లు, ఆర్టిసన్ యూజింగ్ అడ్వాన్స్ టూల్ 20 సీట్లు, అడ్వాన్స్ సీఎంసీ మిషన్ టెక్నీషియన్ 24 సీట్లు, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫాక్చరింగ్ టెక్నీషియన్ 40 సీట్లు ఉన్నాయని తెలిపారు.

పై కోర్సులతో పాటు రెగ్యులర్ కోర్సులు ఎలక్ట్రీషన్, ఫిట్టర్, డ్రాట్స్‌మాన్, సీవోపీఏ కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయని చెప్పారు. 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈ కోర్సుల్లో ప్రవేశాలకు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు అధికారిక వెబ్‌సైట్ హెచ్‌టీటీపీ:/ ఐటీఐ.తెలంగాణ.జీవోవీ.ఇన్‌ను సంప్రదిచాలని సూచించారు. ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్, టి.గెట్ చంద్రశేఖర్ గౌడ్, ఏఎల్‌వో వేణుగోపాల్, ఇతర సిబ్బంది తదితరులు ఉన్నారు.

క్రీడలకు పుట్టినిల్లు వనపర్తి

» అథ్లెటిక్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీధర్



జెండా ఊపి క్రీడాకారుల ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న వాకిటి శ్రీధర్, డివైఎస్‌వో సుధీర్ కుమార్ రెడ్డి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా , జూలై 29 (ఆంధ్రజ్యోతి) : క్రీడలకు పుట్టినిల్లు వనపర్తి అని అథ్లెటిక్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీధర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక పోటీలను ఆయన డీవైఎస్‌వో సుధీర్ కుమార్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆనాడు నారాయణ దాసు పీడీ శిక్షణలో అనేక మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో , జాతీయ స్థాయిలో క్రీడలకు ప్రాతినిథ్యం వహించి వనపర్తికి గొప్ప కీర్తి ప్రతిష్టలు తెచ్చి పెట్టారని పేర్కొన్నారు. ఆగస్టు 3, 4వ తేదీలలో హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక చేయబడినట్లు తెలిపారు. జిల్లా క్రీడల శాఖ అధికారి సుధీర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ... ఆగస్టు 3, 4వ తేదీలలో హనుమకొండలో జరుగు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ కొరకు వనపర్తి జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపిక చేపట్టినట్లు తెలిపారు. అండర్ 14, 16, 18 విభాగాలలో క్రీడాకారుల ఎంపిక జరిగినట్లు పేర్కొన్నారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు శ్రీకాంత్, పీడీలు, క్రీడాకారులు మంజుల, రాధిక, సునీత, యువరాజు, బసవరాజు, మహేష్, శ్రావణ్, దామోదర్, స్వామి, రాజశేఖర్, నరేష్, రాజప్ప, నవీన్, తిరుపతి, జబ్బార్, అనిత పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో పలువురి చేరిక

» రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధుగౌడ్, జిల్లా అధ్యక్షులు డి.మాధవరావు



జర్నలిస్టులకు సభ్యత్వమిచ్చి చేర్చుకుంటున్న రాష్ట్ర కార్యదర్శి మధుగౌడ్

వనపర్తి రూరల్ , జూలై 29 (ఆంధ్రజ్యోతి) : జర్నలిస్టుల పక్షాన టీయుడబ్ల్యూజే (ఐజేయూ) జాతీయ రాష్ట్ర నాయకత్వం ముందుకు సాగుతుందని సంఘం రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధుగౌడ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు కార్యాలయం వద్ద పి.రాము ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధుగౌడ్, జిల్లా అధ్యక్షుడు మాధవరావు, జిల్లా కోశాధికారి మన్యంల సమక్షంలో వివిధ యూనియన్లకు చెందిన పలు పత్రిక, ఎలక్ట్రానిక్ మీడియా నుంచి 30 మంది టీయూడబ్ల్యూజేయు (ఐజేయూ) సభ్యత్వం తీసుకున్నారు.

● **త్వరలోనే హెల్త్ ఇన్సూరెన్స్**

ఇటీవల వనపర్తి జిల్లా కేంద్రంలో జిల్లా మహాసభలు జరిగాయని సభ విజయవంతం కోసం అహర్నిశలు కృషి చేసిన ప్రతీ ఒక్కరికి పేరు పేరున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే తమ నియోజకవర్గం పరిధిలో పని చేసే ప్రతి జర్నలిస్టుకు హెల్త్ ఇన్సూరెన్స్ ఇప్పిస్తామని హామీ ఇచ్చామని, యూనియన్లకు అతీతంగా హెల్త్ ఇన్సూరెన్స్‌ను త్వరలోనే ఎమ్మెల్యే చేతుల మీదుగా ఇప్పించనున్నట్లు తెలిపారు.

అనంతరం జిల్లా అధ్యక్షుడు మాధవరావు మాట్లాడారు. జిల్లా ఉపాధ్యక్షుడు సూరంపల్లి గోపాల్‌చారి, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ రాజు, నాయకులు వెంకట్ గౌడ్, రవికాంత్, వహిద్, పట్టణ అధ్యక్షులు తైలం అరుణ్ రాజు, మహిపాల్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు దాచ హరీష్ కుమార్, విష్ణు, మహేష్ సింగ్, రవి, ఈశ్వర్, ఫరూక్ పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితాలే విచ్ఛిన్నమవుతాయి



డీ అడిక్షన్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ సారా

వనపర్తి వైద్యవిభాగం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితాలే విచ్ఛిన్నమవుతాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రజిని అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నాల్సా (డాన్- డ్రగ్ అవేర్నెస్ అండ్ వెల్నెస్ నావిగేషన్ ఫర్ ఏ డ్రగ్ ఫ్రీ ఇండియా) 2025 స్కీంలో భాగంగా డీ అడిక్షన్ కేంద్రంలో లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... డ్రగ్స్‌కు అలవాటు పడిన వారు, డీ అడిక్షన్ కేంద్రంలో చికిత్స పొందాలనుకునే వారికి మెరుగైన చికిత్స అందించడం జరుగుతుందన్నారు. క్లినిక్‌లో ఉచిత న్యాయ సలహాలు, సూచనలు అందించడం కోసం వలంటీర్లుగా సారా, ప్రతాప్‌రెడ్డి, అరుణల ద్వారా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చన్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడిన వారిని దృష్టిలో పెట్టుకుని రీహాబిలిటేషన్, డీ అడిక్షన్ కేంద్రంలో చికిత్స అందించేందుకు సంస్థ ద్వారా సహాయం చేస్తామన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్, సైకియాట్రీ డాక్టర్ సారా, ఆర్ఎంవో డాక్టర్ జావిద్, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థుల పఠనా సామర్థ్యాలను పెంచాలి

ఖిల్లాగణపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల పఠనా సామర్థ్యాలను పెం పొందించడానికి ఉపాధ్యా యులు కృషి చేయాలని ఎంఈవో జయశంకర్ తెలిపారు. మండలంలోని మానాజీపేట ప్రాథమిక పాఠశాలలో 2వ, 4వ తరగతి చదువుతున్న విద్యార్థుల పఠన సామర్థ్యాలను మంగళవారం ఎంఈవో పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. ప్రభుత్వ బడిలో నాణ్యమైన విద్యను అందించడంతో పాటు మధ్యాహ్నం భోజన పథకంలో పౌష్టికాహారం అందించడానికి మెనూ పాటించాలని అన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూ వివాదం కేసులో హాజరు అవ్వాలని నోటీసులు



నోటీసులు అంటించిన సిబ్బంది

గోపాల్‌పేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : భూ వివాదం కేసుకు సంబంధించిన వారు కలెక్టర్ ముందు హాజరు అవ్వాలని తహసీల్దార్ వారి సొంత గ్రామంలో నోటీసులు అందించారు. మంగళవారం మండలంలోని పొల్కేపాడ్ గ్రామంలో ఉన్న సర్వే నెంబర్ 488/1, 488/2లో ఉన్న 8.20 గుంటల భూమికి సంబంధించిన వారు వచ్చే నెల 2వ తేదీన 11 గంటలకు కలెక్టర్ ఎదుట హాజరు అవ్వాలని తహసీల్దార్ పాండు నాయక్ పొల్కేపాడ్ గ్రామంలో భూమికి సంబంధించిన వ్యక్తులకు నోటీసులు అందజేశారు. లేని వ్యక్తుల కోసం గ్రామ పంచాయతీ నోటీస్ బోర్డుపై ప్రదర్శించారు. లేని వ్యక్తులకు గ్రామస్థులు సమాచారం అందించాలని కోరారు.

అప్రమత్తతతో వ్యాధుల నివారణ



కూలర్‌లో నిల్వ ఉన్న నీటిని పారబోస్తున్న సిబ్బంది

పెబ్బేరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): అప్రమత్తతతోనే వ్యాధుల నివారణ సాధ్యమని మునిసిపల్ ప్రత్యేక అధికారి మీరజ్ అహ్మద్ అన్నారు. వంద రోజుల కార్యాచరణలో భాగంగా మంగళవారం 1వ వార్డులో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాకాలంలో దోమల వ్యాప్తి వల్ల రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి సరిపరాల్లో కుండల్లో, పాత టైరు, కూలర్, పూల కుండీలలో నీటి నిల్వ లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎన్విరాన్మెంటల్ ఇంజనీయర్ యోగేష్ కుమార్, ఉమావతి, పరమేష్, లీలమ్మ, ఏఎన్ఎం లావణ్య, జయశ్రీ, నర్మద, దేవమ్మ తదితరులున్నారు.

హిందూ ధర్మాన్ని సంరక్షించాలి



ఖిల్లా గణపురం ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ చాలీసా పఠించిన హిందూ వాహిని సభ్యులు

ఖిల్లాగణపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సమాజంలో హిందూ ధర్మాన్ని సంరక్షించుకోవడం మన బాధ్యత అని బజరంగ్ దళ్ మండల ప్రముఖ్ బెస్ట్ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయం ఆవరణలో మంగళవారం హిందూ భక్తులు భక్తి శ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. హిందువులు సంఘటితంగా ఉండి సనాతన ధర్మాన్ని కాపాడాలని అన్నారు. అనారోగ్యానికి గురైన భజన మండలి సభ్యుడు బయని చెన్నప్పకు హిందూ వాహిని సభ్యులు మనోధైర్యాన్ని కల్పించి అండగా ఉంటామని భరోసా కల్పించారు. విశ్వహిందూ పరిషత్ సభ్యులు శ్రీనివాసులు, నరసింహ, కేశువులు, లక్ష్మణ్, శ్రీనివాసులు, శివ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

100 రోజుల ప్రణాళికపై నిర్లక్ష్యం తగదు

» సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్ నారాయణరావు



అమరచింత మునిసిపాలిటీలో మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్ నారాయణరావు

అమరచింత , జూలై 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 100 రోజుల ప్రణాళికపై నిర్లక్ష్యం తగతదని, మునిసిపాలిటీల్లో అధికారులు, సిబ్బంది ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని రాష్ట్ర మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ జాయింట్ డైరెక్టర్ నారాయణ రావు పేర్కొన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని ఆయా కాలనీలలో పారిశుద్ధ్య పనులు పరిశీలన, పలు ప్రాంతాల్లో మొక్కలు నాటి అనంతరం మునిసిపల్ కార్యాలయంలో ఉద్యోగులు సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పారిశుద్ధ్యం, తాగునీటి వనరులు, ఇందిరమ్మ ఇల్లు రీవెరిఫికేషన్, ట్రేడ్ లైసెన్స్, అక్రమ భవన నిర్మాణాలపై చర్యలు, పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు.

మునిసిపల్ కమిషనర్ నాగరాజు, మేనేజర్ యూసుఫ్, వార్డు ఆఫీసర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగపంచమి



వనపర్తి పట్టణంలోని న్యూ గంజ్ గణపతి ఆలయంలో నాగ దేవతలకు పూజలు చేస్తున్న మహిళలు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా/ కొత్తకోట, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో మంగళవారం నాగ పంచమి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని న్యూ గంజ్ గణపతి ఆలయం ఆవరణంలో ఉన్న పుట్టకు మహిళలు పూజలు చేసి పాలు పోశారు. అక్కడే ఉన్న నాగ దేవతల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగ పంచమి సందర్భంగా ఆలయ నిర్వాహకులు భక్తుల కోసం అవసరమైన ఏర్పాట్లు చేశారు. అధిక సంఖ్యలో మహిళలు ఆలయానికి విచ్చేసి పూజలు చేశారు.

కొత్తకోట మండలంలో నాగుల పంచమి వేడుకలను భక్తులు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలో కోదండ రామస్వామి, భక్త మార్కండేయస్వామి, కానాయపల్లి గ్రామంలోని కోటిలింగేశ్వరస్వామి దేవాలయాల సమీపంలో ఉన్న నాగుల విగ్రహాలకు, పొలాల్లో ఉన్న పుట్టల్లో భక్తులు పాలు పోసి పూజలు నిర్వహించారు.

కఠిన చర్యలు తప్పవు

» ఎస్పీ రావుల గిరిధర్



మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి, జూలై 29 (ఆంధ్రజ్యోతి) :అన్ని ప్రభుత్వ శాఖల సమిష్టి కృషితో మానవ అక్రమ రవాణా, బాల కార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. మంగళవారం వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం, ఈనెల 15వ తేదీ నుంచి 30వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ సందర్భంగా యాక్సెస్ టు జస్టిస్ కార్యక్రమం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా వనపర్తి జిల్లా రూరల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సేవా సంస్థ, మహిళా శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో సఖి, భరోసా, ఆపరేషన్ ముస్కాన్, షీ టీం, లీగల్ సర్వీసెస్, చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ, జిల్లా వైద్య అధికారి జస్టిస్ జోనల్ బోర్డు వివిధ శాఖలతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. డీసీఆర్‌బీ డీఎస్పీ ఉమామహేశ్వరరావు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులు, వనపర్తి జిల్లా డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షురాలు చెన్నమ్మ థామస్, ఏహెచ్‌టీయూ ఎస్ఐ అంజద్, ముస్కాన్ ఎస్ఐ రాము, జస్టిస్ జువనైల్ బోర్డు మెంబర్ గిరిజ, మానసిక వైద్యురాలు పుష్పలత, సఖి కోఆర్డినేటర్ కవిత, భరోసా కోఆర్డినేటర్ శిరీష, జిల్లా బాలల సంరక్షణ అధికారి రాంబాబు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్లు విజయ్, భరోసా, సఖి ఆపరేషన్ ముస్కాన్, సిబ్బంది, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.